# పోలింగ్ కేంద్రాలకు బార్ కోడింగ్ చేయించాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక →



మహబూబాబాద్, నవంబర్ 20: ప్రహరీ లేని పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు బార్ కోడింగ్ ఏర్పాటు చేయించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే శశాంక ఆదేశించారు. సోమవారం మహబూబాబాద్ మండలంలో వీఎస్ లక్ష్మీపురం గ్రామంలోని హైస్కూల్‌ను కలెక్టర్ సందర్శించారు. పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినందున బార్ కోడింగ్ తప్పని సరిగా చేపట్టాలన్నారు. గదులను పరిశీలిస్తూ పోలింగ్‌కు అనుకూలంగా ఉన్నాయా..? వాటిల్లో చేపట్టే పనులు, ఏర్పాటు చేసే సౌకర్యాలపై అధికారులకు వివరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

### 'పోలింగ్'పై సమగ్ర అవగాహన పొందాలి

మహబూబాబాద్ : మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ నిర్వహణపై సమగ్ర అవగాహన పొందాలని జిల్లా ఎన్నికల అధికారి శశాంక అన్నారు. సోమవారం ఐడీవోసీలోని కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఇరా సింఘాల్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో డోర్నకల్, మహబూబాబాద్ సంపూర్ణ నియోజకవర్గాలని, మొత్తంగా 773 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, 106 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 30న ఉదయం 5.30 నుంచి మాక్ పోలింగ్ ప్రారంభం అవుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెబ్ కాస్టింగ్ ఉంటుందని, ప్రతి కేంద్రంలో ఎన్నికల నిబంధనల మేరకు ర్యాంపు, మరుగుదొడ్లు, తాగునీరు, వీల్‌చైర్ల సౌకర్యం, లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో నోడల్ అధికారి సూర్యనారాయణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ మూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### చిన్నగూడూరులో..

చిన్నగూడూరు : పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేసి, ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. మండల కేంద్రంతో పాటు గుండంరాజుపల్లిలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి సిబ్బంది, బీఎల్‌వోలతో మాట్లాడారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు స్లిప్పులు ఓటర్‌కే అందించాలన్నారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు సాధించి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ అలీ,ఎంపీడీవో శ్యాంసుందర్, హెచ్‌ఎం రవికుమార్, ఎస్సై సంతోష్‌కుమార్, ఎంపీవో యాకయ్య అధికారులు పాల్గొన్నారు.



11వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న కోటిలింగం, నాయకులు

# అభివృద్ధి, సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష

డోర్నకల్, నవంబర్ 20: సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ విజయానికి అభివృద్ధి, సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష అని మున్సిపల్ వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం అన్నారు. సోమవారం 11వ వార్డులో మ్యానిఫెస్టోను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నిరుపేదలకు అండగా నిలిచినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జరిగాయని, కారు గుర్తుకు ఓటు వేసి రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జాల నరేశ్, కేశబోయిన వెంకటేశ్, సకినాల వెంకన్న, పీ గోపి, కొత్త వెంకటేశ్వర్లు, బొబ్బల ఉపేందర్, కొత్త నరేందర్, యాకయ్య, దాసరి శ్రీను, బొల్లం బిన్ని పాల్గొన్నారు.



నర్సింహులపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. కటిక చీకట్లే..

నర్సింహులపేట, నవంబర్ 20: కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కటిక చీకట్లేనని, బీఆర్ఎస్‌ను గెలిపిస్తే అభివృద్ధి మరింత ముందుకు పోతుందని పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం మండలంలోని గ్రామాలు, తండాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. 24 గంటల కరెంట్ కవాలా? మాయ మాటలు చెప్పే కాంగ్రెస్ మూడు గంటల కరెంట్ కావాలో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఎక్కడ అధికాంలోకి వచ్చినా కాంగ్రెస్ విద్యుత్ వ్యవస్థను దెబ్బతీయడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని, కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైదం దేవేందర్, నాయకులు టేకుల యాదగిరెడ్డి, వైస్ ఎంపీపీ జాటోత్ దేవేందర్, కాల్సానీ దామోదర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, రవి, వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, రజితారెడ్డి, రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, జగదీశ్వర్, యాకన్న, నర్సింహారెడ్డి, రామన్న, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణురెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమిరెల్లి

## ఎమ్మెల్యే రెడ్యానాయక్‌పై
# అసత్య ఆరోపణలు మానుకోవాలి

### బీఆర్ఎస్ నాయకులు

చిన్నగూడూరు, నవంబర్ 20 : ఎమ్మెల్యే రెడ్యాపై కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బర్తాపురం కొమిరెల్లి అన్నారు. సోమవారం ఉగ్గంపల్లిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. ఉగ్గంపల్లిలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తూ గ్రామంలో జరిగిన అభివృద్ధిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ అభ్యర్థిగా రెడ్యా భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. అందుకు నియోజకవర్గంలో జరిగిన అబివృద్ధే నిదర్శనమన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించే రెడ్యానాయక్‌పై కావాలనే ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు యాకి, ఉప సర్పంచ్ ఉమాపతి, నాయకులు మల్లేశ్, గంగరాజు, అంబరీష, శ్రీను, రమేశ్, మల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కురవి ఆలయంలో అన్నదానం

కురవి, నవంబర్ 20 : అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని వీరభద్ర స్వామి ఆలయ ఈవో సత్యనారాయణ అన్నారు. ఆలయంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మాలధారులకు అన్నదానం నిర్విరామంగా కొనసాగుతున్నది. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఈవో కోరారు. అన్నదానానికి సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. గురుస్వాములు బీ నాగయ్య, జీ వీరన్న, కే వీరన్న, కే నాగరాజు పాల్గొన్నారు.

# పౌరుల అస్తిత్వానికి ప్రతీక ఓటు

### ఎస్సై క్రాంతి కుమార్

నెల్లికుదురు, నవంబర్ 20 : పౌరుల అస్తిత్వానికి ప్రతీక ఓటు అని, ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఓటరు కాపలాదారుడేనని నెల్లికుదురు ఎస్సై క్రాంతి కుమార్ అన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్లు డేవిడ్, అశోక్‌లతో కలిసి నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఓటు హక్కు సద్వినియోగం కాకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనదని, ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజు తండా సర్పంచ్ రమేశ్, ఉప సర్పంచ్ రవి, ఆలేరు గ్రామ పంచాయతీ సెక్రెటరీ జానీ పాషా, ఏఎస్సై యాకయ్య, కానిస్టేబుల్ రమాదేవి, ముకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన
# ఏకలవ్య విద్యార్థులు

బయ్యారం, నవంబర్ 20 : రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బయ్యారం ఏకలవ్య విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 17 నుంచి 19 వరకు హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనపరిచి నాలుగు సిల్వర్, మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. 40 కేజీల విభాగంలో సీహెచ్ భార్గవి, 45 కేజీల విభాగంలో స్నేహ, 55 కేజీల విభాగంలో కృష్ణకుమారి, 58 కేజీల విభాగంలో భారతి సిల్వర్ మెడల్స్, 59 కేజీల విభాగంలో బీ అఖిల, 71 కేజీ విభాగంలో ఈ దివ్య, 76 కేజీల విభాగంలో బీ వీరబాబు బ్రాంజ్ మెడల్ సాధించారు. వారిని ప్రిన్సిపాల్ రవిబాబు, వైస్ ప్రిన్సిపాల్ గీత, పీఈటీ విజయ, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ ప్రెసిడెంట్ అమర్ సింగ్, సెక్రటరీ సుధాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవిబాబు


# బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

### జడ్పీ చైర్ పర్సన్ ఆంగోత్ బిందు

బయ్యారం, నవంబర్ 20 : బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని జడ్పీ చైర్ పర్సన్ ఆంగోత్ బిందు అన్నారు. సోమవారం మండలంలోని జగ్గుతండాలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... రాష్ట్ర అభివృద్ధి కేవలం సీఎం కేసీఆర్ వల్లనే సాధ్యమవుతుందన్నారు. సమైక్య ఆంధ్రలో తెలంగాణ ప్రాంతం వెనుకబాటుకు గురైందని తెలిపారు. పంటలకు సాగునీరు అందక, గ్రామాలకు సరైన రహదారి లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడే వారన్నారు. స్వరాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రగతి కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్ సర్కారు రావాలని కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు బొల్లి వెంకట కృష్ణ, నాయకులు రామోజీ పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం చేస్తున్న ఆంగోత్ బిందు, బీఆర్ఎస్ నాయకులు



కౌసల్యదేవిపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# మద్యం బాటిళ్లు స్వాధీనం

డోర్నకల్, నవంబర్ 20 : మండలంలోని చిలుక్కోయలపాడు గ్రామంలో సోమవారం మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఝాన్సీ తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన యూ నాగరాజు బెల్టు షాపులో మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీటి విలువ రూ.4,500 ఉంటుందని పేర్కొన్నారు.

# ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

డోర్నకల్, నవంబర్ 20: ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్‌కు ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న అన్నారు. మున్సిపాలిటీలోని 14వ వార్డులో మ్యానిఫెస్టో కరపత్రాలు అందిస్తూ ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీలో ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జరిగాయని, పదేళ్లలో సీఎం కేసీఆర్ తెలంగాణను నంబర్ వన్ స్థానంలో నిలిపినట్లు పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి రెడ్యా నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఏఎంసీ చైర్మన్ కత్తెరశాల విద్యాసాగర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ కే కోటిలింగం, వార్డు కౌన్సిలర్ పర్వీన్ సూల్తానా, నాయకులు సలీం, వెంకటమ్మ, గౌస్ పాషా పాల్గొన్నారు.



14వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ వీరన్న